ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08.09.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని పలు జలాశయాల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. హైదరాబాద్ లో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ గేట్లు ఎత్తివేయడంతో మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.
2. నిన్నటి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఖమ్మంలో మున్నేరు మళ్లీ ఉధృతంగా ప్రవహిస్తోంది.
3. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు వరద బాధితులను ఆదుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.
4. ప్రముఖ సాహితివేత్త నలిగొండ భాస్కర్ కు రేపు హైదరాబాద్ లో జరిగే కార్యక్రమంలో 2024 సంవత్సరం కాళోజి నారాయణ రావు సాహితి పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

**హైదరాబాద్ - జలాశయాలు**

ఎగువన కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ శివారులోని జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్లు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువ కావడంతో జలమండలి అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు . రాగల రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ సూచనతో ముందస్తుగా ఉస్మాన్ సాగర్ , హిమాయత్ సాగర్ గేట్లను ఎత్తారు. హిమాయత్సాగర్ ఒక గేటు ఒక అడుగు మేర ఎత్తి 330 క్యూసెక్కుల

నీటిని మూసీలోకి వదిలారు. ఉస్మాన్ సాగర్కు సంబంధించి రెండు గేట్లను అడుగు మేర ఎత్తి 226 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. జంట జలాశయాల నుంచి వదలిన నీరు లంగర్హౌజ్ బాపు ఘాట్ మీదుగా మూసీలోకి చేరింది . అక్కడి నుంచి జియాగూడ , పురానాఫూల్, ఛాదర్ఘాట్ , గోల్నాక, మూసారాంబాగ్, నాగోల్ వరకు మూసీలోకి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. దీనితో జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశాయి.

డెస్క్

**<u>ఖమ్మం - మున్నేరు</u>**

మున్నేరు వరద ముప్పు నుంచి ఖమ్మం నగరం పూర్తిగా కోలుకోక ముందే మళ్లీ వరద ప్రమాదం ఏర్పడింది. నిన్నటి నుంచి కురుస్తున్న భారీ వర్షలకు రాత్రి నుంచి మున్నేరు మళ్లీ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో వరద కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. మధిర నియోజకవర్గ పరిధిలో విస్తారంగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు మళ్లీ జలమయం అయ్యాయి. దీంతో అధికారులు మధిర లోని వంద పడకల ఆసుపత్రిలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి వరద బాధితులను తరలిస్తున్నారు. మధిర మండలంలోని చిలుకూరి వద్ద ఆకేరు ఏరు రోడ్డు వరద ప్రవాహం కారణంగా 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ నుంచి ఆంధ్రకు బోనకల్లు మీదుగా వెళ్లే బస్సు సర్వీసులు నిలిపివేశారు.

పిటిసి, ఖమ్మం

**<u>నల్గొండ - నాగార్జున సాగర్</u>**

నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు మరోసారి వరద ఉధృతి పెరగడంతో అధికారులు 24 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 589 అడుగులకు చేరింది.

పిటిసి, నల్గొండ

**భద్రాచలం**

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుతోంది. ప్రస్తుతం 28.6 అడుగుల మేర గోదావరి ప్రవహిస్తోంది. మరోవైపు కిన్నెరసాని జలాశయం నీటిమట్టం 407 అడుగులు కాగా ప్రస్తుతం 404 అడుగులకు పైగా చేరుకుంది. ఇలా ఉండగా భద్రాద్రి కొత్తగూడం జిల్లాలో నిన్నటి నుంచి పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ అయిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

పిటిసి, కొత్తగూడెం

**ఖమ్మం- కిషన్ రెడ్డి**

రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ వరద బాధితులను ఆదుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈరోజు ఖమ్మం జిల్లా మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలను కేంద్ర మంత్రి పరిశీలించి వరద బాధితులతో మాట్లాడారు . ఎవరు అధైర్య పడాల్సిన పనిలేదని , ధైర్యంగా ఉండాలని వరద బాధితులకు ధైర్యం చెప్పారు . వరద బాధితులకు కేంద్ర ప్రభుత్వం కూడా తమ వంతు సహాయం అందిస్తుందని , రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక అందిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయం అందించగలదని కిషన్ రెడ్డి చెప్పారు. ఇల్లు కోల్పోయిన పేదవారికి తాత్కాలికంగా షెల్టర్ ఏర్పాటు చేయాలని, వరద బాధితులకు ఆర్థిక సహాయం తో పాటు వంట పాత్రలు, విద్యార్థులకు పుస్తకాలు, నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు.

BYTE- KISHAN REDDY

(PTC)

**<u>బండి సంజయ్</u>**

రాష్ట్రం లో  వర్షాలతో నష్టపోయిన ప్రజలను అన్ని విధాలా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని , కేంద్రం కూడా తనవంతు సాయం చేసేందుకు సిద్ధంగా ఉందని  కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ లోని టవర్ సర్కిల్ వద్ద గణేశ్ మండపాన్ని దర్శించుకున్న అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ , రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా బాధితులను ఆదుకోవాలని కోరారు.

(PTC)

**<u>వాతావరణం</u>**

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాగల మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్  వాతావరణ కేంద్రం తెలిపింది . కుమురం భీం ఆసిఫాబాద్ , మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ రోజు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది . ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. అలాగే అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉన్న ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఇలా ఉండగా  వాయువ్య పరిసర మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తర దిశగా కదులుతూ బలపడి ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరంలోని వాయువ్య బంగాళాఖాతం వద్ద నేడు వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

(DESK)

**<u>కాళోజీ అవార్డు</u>**

ప్రముఖ సాహితీవేత్త , బహుభాషా కోవిదుడు , కవి, రచయిత, అనువాదకుడు నలిమెల భాస్కర్కు 2024 సంవత్సరానికి కాళోజీ నారాయణరావు సాహితీ పురస్కారం లభించింది . ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా సాహితీ పురస్కారం అందిస్తోంది. ఈఏడాది అవార్డు గ్రహీత ఎంపిక కోసం ప్రభుత్వం ప్రముఖ కవి అందెశ్రీ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది . కమిటీ సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ పురస్కారానికి నలిమెల భాస్కర్ను ఎంపిక చేసింది . రేపుహైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో నలిమెల భాస్కర్ కు పురస్కారం కింద 1,01,116 రూపాయల నగదు అందిస్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన నలిమెల భాస్కర్కు 14 భాషల్లో పట్టుంది. తెలుగు అధ్యాపకులుగా పనిచేసి 2011లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు . అద్దంలో గాంధారి, మట్టి ముత్యాలు, సుద్దముక్క వంటి సంకలనాలను ఆవిష్కరించారు. పలు భారతీయ భాషల కథలను తెలుగులోకి అనువదించడంతో పాటు తెలంగాణ పదకోశాన్ని రూపొందించారు. మలయాళ నవల స్మారక శిశిగల్ను తెలుగులోకి స్మారక శిలలు పేరిట అనువదించారు. ఈ పుస్తకానికి 2013లో అనువాద సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

(PTC)

**బీజేపీ**

రాష్ట్రం లో బీజేపీ సభ్యత్వ నమోదు ను కేంద్ర మంత్రి కిషన్రెడ్డి ఈ సాయంత్రం హైదరాబాద్ లో ప్రారంభిస్తారు. ఈ సభ్యత్వ నమోదు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ డీకే అరుణ, బీజేపీ రాష్ట్ర సభ్యత్వ నమోదు ఇంఛార్జీలు , జాతీయ నాయకులు అర్వింద్ మీనన్, అభయ్ పాటిల్ హాజరుకానున్నారు. జిల్లా కేంద్రాల్లో రేపు, ఎల్లుండి సభ్యత్వ నమోదు చేపడతారు. ఈ నెల 11 నుంచి 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. (DESK)

**హైడ్రా**

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్- హైడ్రా- బృందాలు హైదరాబాద్ లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలను కొనసాగిస్తున్నాయి . మాదాపూర్లోని సున్నం చెరువు ఎఫ్టీఎల్లో నిర్మించిన ఓ అపార్ట్మెంట్ను , దుండిగల్ వద్ద మల్లంపేట కత్వా చెరువులోని అనధికారిక విల్లాలను హైడ్రా ఈ రోజు కూల్చివేస్తోంది.

(DESK)

**గణేష్**

గణేష్ నవరాత్రుల్లో నేడు రెండవ రోజున వినాయకుని వికట వినాయకునిగా పూజిస్తున్నారు. జంట నగరాల్లో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో ఉదయం , సాయంత్రం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్ లో ఏర్పాటు చేసిన 70 అడుగుల సప్తముఖ మహాశక్తి గణపతిని దర్శించేందుకు భక్తులు పోటెత్తారు. ఈరోజు ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఖైరతాబాద్ గణేష్ ను చూసేందుకు ప్రజలు భారీగా తరలి వస్తున్నారు.

డెస్క్

**పెద్దపల్లి - గణేష్**

రామగుండం పోలీస్ కమీషనరేట్ - పెద్దపల్లి జోన్- గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను పోలీస్ కమీషనర్ ఎం . శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. అనుమతులకు లోబడి పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని , ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరించరాదని నిర్వాహకులకు సూచించారు.

(PTC)

**<u>పొన్నం- సిద్దిపేట</u>**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ రోజు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటించారు. కోహెడ మండలంలోని 800 సంవత్సరాల క్రితం కాకతీయ రాజులు నిర్మించిన శ్రీవరసిద్ధ లింగేశ్వర దేవస్థానం ఆలయ పునఃనిర్మాణ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు . అనంతరం నారాయణపురం లో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

(PTC)

**<u>వేములవాడ</u>**

రాజన్న సిరిసిల్ల జిల్లా లోని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు . ఆలయ అభివృద్ధి పనులను శృంగేరి పీఠం , పండితులు, భక్తుల సూచనలతో చేపడతామని ఆయన చెప్పారు.

(PTC)